

# బాసుదేవుడూ-బాబూగారూ

[ 16-7-80 వ తేదీ ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రికలో ప్రచురించిన బాసుదేవుడికథ-శ్రీ భగవతి రావు రచన-చదివాక, అందులో ముఖ్యంగా కన్నయ్య అన్న మాటలు -అవును, బాబూ! నువ్వయితే చదూకున్నోడివి కాబట్టి ఎలాగో ప్రయివేట్లు చెప్పుకునో, ఇంకెలాగో బతికేస్తవు. అక్షరం ముక్క తెలీనోళ్ళం ఈ బురదలో కూరుకు పోవలసిందే కదా, బాబూ! మాకు విముక్తి మరి లేదు బాబూ! మా బతుకు లిలా తెల్లారి పోవలసిందే-చదివాక ]

**కన్నయ్య** పడకేశాడు. బి. ఎ. మిడికిన చలం హుంకరించి మరీ రిజైన్ చేసి పోయాడు. ముద్దుల పెళ్ళాం సణుగుడు చెవిలో జోరీగలాగ తయారై బాసుదేవుడు మరో ప్యూనుకోసం వెదకడం ప్రారంభించాడు. ఇండియా (దటీజ్ భారత దేశం ) లో ప్యూనులకే కరువా? లేదుగాక లేదు !

చింతాకు నయనమ్ములవాడు, సీసా బిరడా తలకాయవాడు, భూగోళాన్నే లోన దాచుకోగల బొజ్జవాడు, పోతు చర్మమువాడు, ఆయిదడుగుల ఆజానుబాహుడు—గణపతిని ప్రత్యేకంగా ఎంచుకున్నాడు బాసుదేవుడు. అతనినే ఎంచుకోవడానికి ప్రత్యేకమైన కారణాలూ ఉన్నాయి.

## పువ్వుల చంద్ర

అతను కన్నయ్యలా అర్భకుడు కాదు. ఒకే పట్టాన పడకేయడు. చలంలా బి. ఎ. మిడకలేదు. చదవడం కాదుకదా, బి. ఎ. అని వ్రాయడం కూడా చేతకాదు. అయినా, బియ్యం కడగడానికి బి. ఎ. ఎందుకు? పిల్లల్ని ఆడించడానికి పిహెచ్. డి. ఎందుకు? కిందివాడు చదువుకున్నవాడూ, తెలివైనవాడూ అయితే వచ్చే ఇబ్బందులు బాసుదేవుడు అనుభవించే ఉన్నాడు కదా !

ఇంటర్వ్యూలో "రామాయణంఎవరువ్రాశారురా?" అని అడిగితే—"నేను వ్రాయలేదు మొర్రో !" అని మొత్తుకున్నాడు. పైగా "ఎవరు వ్రాశారో రహస్యంగా ఆరా తీసి మీకు సాయంకాలంలోగా చెబుతా, అయ్యగారూ" అన్నాడు వినయంగా.

"క్రిష్ణకి రుక్మిణి ఏమవుతుంది?" అని అడిగితే, "నాకు సినేమా సంగతులు తెలియవు, అయ్యగారూ" అన్నాడు మరింత వినయంగా.



Studio Amin/SC

“నీవేం పనులు చేయగలవు? అని అడిగితే— “ఆఫీసు ఫైళ్ళు మోస్తాను, రూళ్ళు గీస్తాను, కాఫీ, టీలు తెస్తాను'' అనలేదు. “అంట్లు తోముతాను, కాళ్ళు పడతాను, ఒంటికి మాలిష్ చేస్తాను, వాళ్ళూ వీళ్ళూ మీ గురించి చెప్పుకునే మాటలు రహస్యంగా మీకు చేర వేస్తాను'' అన్నాడు మరింత వినయంగా.

అతని వినయం బాసుదేవుడికి నచ్చింది. 'భేష్! నాకు తగినవాడు వీడే' అనే నిర్ణయానికి వచ్చేశాడు.

మరు నిమిషంలో గణపతి ఆఫీసు ప్యూన్‌గా అవతారం ధరించాడు.

కారు దిగి, ముందు బాసుదేవుడు, వెనక గణపతి నడిచి వస్తూంటే చూడ చక్కని దృశ్యం. చూడటానికి రెండు కళ్ళూ చాలవు. గుమాస్తా అందరూ పని మానేసి గుడ్లప్పగించి చూస్తారు అయిదు నిమిషాలు. త్వరలోనే గణపతికి “బాబా'' అని పేరు పెట్టేశారు వాళ్ళు. బాబా అంటే సాయిబాబా కాదు; హరనాధ్ బాబా అంతకంటే కాదు. బాబా అంటే బాసుడి బాడీ గార్డు!

బాబా ఆఫీసులో అర్జెంట్‌గా తన ప్రత్యేకమైన ముద్ర వేసి జెండా పాతేశాడు. వాడు బాసు కారులో బాసుతోనే రాక, పోక. (కన్నయ్య, చలం— వాళ్ళకు కారు యోగం పట్టలేదు) ఈ రాక పోకల మధ్య కాలంలో బాబా ఆఫీసులో హడావిడిగా అటూ, ఇటూ తిరుగుతూ ఉంటాడు.

ఎవరైనా ఏదైనా పని చెబితే, “అరే, బచ్చా! నువ్వట్రా నాకు పని చెపేది?'' అన్నట్లు చూస్తాడు. ముఖం నిండా విసుగు పులుముకుంటాడు. ఆ ముఖం చూసి ఎవరూ అసలు పనే చెప్పరు. ఒకవేళ చెప్పినా, ఒక ఫైలు బదులు మరొకటి పట్టుకువస్తాడు. పెన్‌లో సిరా పోయమంటే, పోస్తాడు—టేబుల్‌నిండా! రూళ్ళు గీయమంటే, గీస్తాడు— రాజమండ్రిలో బయలుదేరిన గీత కన్యాకుమారిగుండా లంకను చుట్టి ఆస్ట్రేలియా పోయేటట్టు! టీ తెమ్మని ఎవరైనా ఫ్లాస్కు ఇస్తే, తెస్తాడు—రీఫిల్ బద్దలు గొట్టి! టిఫిన్ తెమ్మన్నా, తెస్తాడు—సగం 'రుచి' చూసి!

గుమాస్తా అందరూ కలిసి—యశోదమ్మతో గోపికల్లా—బాసుదేవుని వద్ద గోల పెడితే, అంతా విని నవ్వుకుని, ఆయన తరుణోపాయం సెలవిచ్చారు. “అసలే వాడు మొద్దు వెధవ. ఇకనుండి వాడికే పనులూ చెప్పకండి! మీ సమస్య తీరుతుంది!''

అదేదో పెద్ద జోక్ అయినట్టు కొందరు భళ్ళున నవ్వేశారు. బాసుదేవుని దరహాసం గమనించి ధైర్యం తెచ్చుకున్న మరికొందరు బాబామీద ఉన్నవీ, లేనివీ దండ గుచ్చి మరీ చెప్పారు.

ఆఫ్టరాల్ గుమాస్తాగాళ్ళు తన ముందు నవ్వడమా! తనకే సలహాలు చెప్పడమా! వ్వ! అవ్వవ్వ!

బాసుదేవుడు అంతలోనే నరసింహస్వామి అయాడు. “కత్తిరించేస్తాను, జాగ్రత్త! ఒళ్ళు దగ్గర ఉంచుకొని పని చేసుకోండి. ఎవడో పని చేయడం లేదని మీ రందరూ పనులు ఎగగొట్టే

# ఆమె నీడలు

చావడానికి సిద్ధపడి
వృద్ధ సూర్యుడు
స్వర్ణ దానము చేస్తాడు.
యౌవన సూర్యుడు వెండినే ఇస్తాడు.

అంతా అనిశ్చితం ప్రపంచంలో,
నిశ్చితమైనది మరణము మాత్రమే –
ఆస్తికుడైనా, నాస్తికుడైనా
శాస్త్రకోవిదుడైనా, అజ్ఞాని అయినా
చావు గాలములో చిక్కే చేపే.

వేటగాడు
అంబులు విసురుతూనే ఉన్నాడు
గురి తప్పుతూనే ఉన్నాడు
పక్షి గూడు కట్టుకొంటూనే ఉన్నది.

ప్రభుత్వోద్యోగులు సమ్మె చేస్తే
కష్టపడేది ప్రజలే.
సైనికులు తిరుగుబాటు చేస్తే
పడిపోయేది ప్రభుత్వమే.

ప్రజల భయ భక్తుల
కోరువాడు నియంత.
ప్రేమాదరణల
కోరువాడు నాయకుడు.

భర్తకన్న జానెడు
పొడవుగా ఉంటుంది ఆమె
పార్టీలకు తరుచుగా వస్తారు
జతగా ఎన్నడు నడవరు
ఆమెకు వినోదంగా ఉంటుంది
అతనికి సంకోచంగా ఉంటుంది.

కొన్ని సంఘాలలో
భార్య వయస్సున పెద్దదైనా
ఆక్షేపణ లేదు
కొన్ని సంఘాలలో
అయిదు ఏళ్ళయినా
చిన్నదిగా ఉండాలని పట్టింపు.

దుష్టుడైన యువకుడు
బలాత్కరించి
పెద్దదైన ఆమెను ముద్దిడ బోయాడు.
అతని నాలుక కొనను
గట్టిగా కొరికి ఉమ్మి వేసింది.
ఆసుపత్రిలో చేరాడు
పోలీసు కేసు పెట్టారు.

బాలి డాన్సు భర్తతో చేసి
మిగతావి పరపురుషులతో చెయ్యాలి
అపరిచితుడు అడిగినా నిరాకరింపరాదు.
అదే డాన్సు కుతూహలుర మర్యాద.

డిన్నరు పార్టీలో భర్త పక్క
భార్య కూర్చొన రాదు
ఇద్దరు పరపురుషుల మధ్య కూర్చోవాలి
వారితోనే సంభాషణ జరపాలి
అదే డిన్నరు సంప్రదాయ మర్యాద.

– బెజవాడ గోపాలరెడ్డి

---

దాడీలు చెప్పడానికి వచ్చారా? పొండి...పొండి'' అని గర్జించాడు.

ఖిన్నులై వెన్ను చూపారు గుమాస్తాలు. వాళ్ళ కొక విషయం స్పష్టంగా అర్థం అయిపోయింది. బాబాగాడు ఏ పనీ చేయకపోయినా, బాసుదేవుడు వాణ్ణి కోప్పడడు ! బాసుని కోపం అంతా గుమాస్తాలమీద ఖర్చు అయిపోయి, ఇంకేమాత్రమూ కోపం స్టాకులో లేక బాబాగాణ్ణి తిట్టడం లేదు అనుకోవడానికి వీలులేదు. బాసు దేవుని కోపం జీవనది లాంటిది ! మరి బాబా గాడికి లభిస్తున్న అపూర్వమైన ఆదరణకు కారణం ఏమిటి? అని ఆ బక్క జీవులు దిక్కులు చూస్తూ తర్జన భర్జన పడుతున్నారు.

గణపతి రాకవల్ల ఇక పై తాను బాసాలయానికి వెళ్ళ నవసరం లేదని ధైర్యం తెచ్చుకుని పడకవేసిన కన్నయ్య లేచి ఆఫీసు పనిలో చేరాడు.

''ఈ గణపతిగాడు బాసాలయంలో గొడ్డు చాకిరీ చేస్తాడు. అందుకని వీడంటే ఆయనకు అభిమానం'' అన్నాడు కన్నయ్య.

''చాకిరీ నీవూ చేశావు. చలం కూడా చేశాడు. మరి మిమ్మల్నెప్పుడూ ఆదరించలేదు బాసుడు. మరి బాబాగాడి ప్రత్యేకత ఏమిటో?'' శంకరరావు కుశ్శంక లేవదీశాడు.

''బాబాగాడు బాసుదేవుడికి స్పెషల్ పూలతో సహస్ర నామార్చన చేస్తున్నాడు కాబోలు. ఆ పూలు మనకూ దొరికితే బాగుండును.'' ఇది నిత్య భక్తగారి అభిప్రాయం.

మొగలాయీ దర్బార్' నవల క్షుణ్ణంగా చదివి, మహారాణులూ యువరాణులూ పోటీపడి గణపతిలాంటి వాళ్ళనే ప్రేమిస్తారని స్థిర నిర్ణయానికి వచ్చిన మగ మహారాజా నిత్యభక్తగారి అభిప్రాయాన్ని ఖండిస్తూ, ''బాబాగాడు అమ్మగార్ని పట్టే ఉంటాడు'' అని ఖరాఖండిగా చెప్పాడు.

ఎంత బాసుడైనా బాసుణి (అంటే బాసు భార్య ! ) చేతిలో కీలు బొమ్మే కదా ! అందుకే వాడికా ఆదరణ!

వీళ్ళ అభిప్రాయాల్లో నిజం పాలు ఎంతో కాని, ఒక విషయంమాత్రం నిజమైన నిజం! బాసుడికి బాబా మీద చెక్కుచెదరని గురి! కారణం...

మనుష్యు లందరికీ రెండేసి చేతులూ, పదేసి వేళ్ళూ ఉన్నా, ఒక చెయ్యీ, అయిదు వేళ్ళూ మాత్రమే ఉపయోగిస్తూ ప్రఖ్యాతులైన కలంపోటు గాళ్ళు ఉన్నారు ఈ ప్రపంచంలో. కత్తిపోటుగాళ్ళూ ఉన్నారు. ఒక వేలే ఎత్తి ఎదుటివాళ్ళను నిందించే వారుఉన్నారు. రెండు వేళ్ళెత్తి—విక్టరీ మాదే— అనేవాళ్ళూ ఉన్నారు. మొత్తం చెయ్యి చూపించి రాజ్యం ఏలే వాళ్ళూ ఉన్నారు.

గణపతి ప్రత్యేకత ఏమంటే, పదివేళ్ళా! ఉపయోగించి స్వర్గం చూపిస్తాడు ! (పొడిచంపుతాడని కాదు అర్థం !)

ఆఫీసులో అరిచి, అరిచి, అలిసిపోయి ఇల్లు చేరిన బాసుదేవుడి ఒళ్ళు పట్టి, కాళ్ళు పట్టి, తలకు మర్దనా చేస్తాడు గణపతి. వేళ్ళతో సన్నాయి నొక్కులు నొక్కుతూ తలమీద తటకిటదోం అని దరువు వేస్తాంటే, శంకరాభరణం శంకర శాస్త్రి పాటలు వింటున్నట్టు ఉంటుంది బాసు దేవుడికి.

గణపతి సుతారంగా వేళ్ళు కదుపుతూ తన ఒళ్ళూ, కాళ్ళూ మాలిష్ చేస్తూంటే, బాసు దేవుడికి కాళ్ళు తేలిపోయి, కళ్ళు మూసుకుపోయి, ఎదురుగా స్వర్గం కనిపిస్తుంది. ఆ స్వర్గంలో తన ముద్దుల భార్యకు తెలియకుండా రంభతో రసాస్వాదన చేస్తున్నట్టు ఉంటుంది, అతనికి.

వాసుదేవుడు కుచేలుడి అటుకులకు పడి పోయినట్టు, బాసుదేవుడు గణపతి మాలిష్ మత్తులో పడిపోయాడు.

మాలిష్ పూర్తి కాగానే బాసుదేవుడికి యౌవనం తిరిగి వచ్చినట్టు ఉండేది. అరిచే శక్తీ, కరిచే యుక్తీ అతని మెదడు నిండా కూరుకుపోయి పిటపిట లాడేది, మరునాడు ఆఫీసులో ప్రయోగించడానికి !



కొందరికి కాఫీ, కొందరికి సిగరెట్, ఇంకొందరికి నల్లమందు, మరికొందరికి తాగుడు అలవాటైతే వాళ్ళు తప్పించుకోలేరు. ఆ సమయానికి అది పడకపోతే వాళ్ళ మెదడు ఖాళీ! గంగ వెర్రు లెత్తిపోతారు.

నల్లమందులాగ, విస్కీలాగ అలవాటై కూర్చుంది బాసుదేవుడికి మాలిష్!

అదీ బాసుదేవుడి ఆదరణకు అసలు కారణం. కొసరు కారణాలూ కొన్ని ఉన్నాయి. కొంచెం మంద బుద్ధి అన్న మాటే కాని, బాసుణి చెప్పిన అన్ని పనులు విసుక్కోకుండా చేస్తాడు గణపతి. బాడీ, లంగాలూ ఉతకడం దగ్గరనుంచి వంట చేయడం వరకు అన్ని పనులూ. అదికాక కుమార బాసులను భుజాలమీద ఎక్కించుకుని హనుమంతుడులా గంతులేస్తూ ఆడిస్తాడు. వాళ్ళను భద్రంగా స్కూలుకు తీసుకు వెళతాడు. తీసుకు వస్తాడు.

దానాదీనా గణపతి ఒక రికార్డు స్థాపించేశాడు. సేవలు చేయలేక కన్నయ్య ఆరు నెలలకే పడక వేస్తే, చలం మూడు నెలలకే రిజైన్ చేసి పారిపోయాడు. నరమానవు డెవడూ బాసాలయంలో ఏడాదిపాటు వూడిగం చేయలేదు. ఆ ఘనత గణపతికే దక్కింది.

ఆఫీసులో అతని ఉద్యోగం కొయపరిచారు.

అదిగో.. ఆ రోజే... అప్పుడే...


సన్నాయి నొక్కుల్లా సున్నితంగా సాగవలసిన మాలిష్ ఆ రోజు తబలా దరువులా మోగింది. ఫలితంగా బాసుదేవుడి మెడ నరం బెణికి తల ఒక పక్కకు ఒరిగిపోయింది. కదపడం సాధ్యం కాదు. వంకర తలతో, రెక్కలు తెగిన జటాయువులా వస్తున్న బాసును చూచి గుమాస్తాలు చాటుగా నవ్వుకున్నారు.

మరునాడు కాలు ఇరుకు పట్టింది. కుంటి గుర్రంలా గంతులు వేస్తూ వచ్చాడు బాసుడు. గుమాస్తాల నవ్వు కంటబడి, అగ్గిమీద గుగ్గిలం అయాడు. కాని, తన గదిలో ప్రవేశించగానే అతని అంతరంగంలో ఆనందం గంతులు వేసింది. ఎవడో గుమాస్తా చచ్చినందుకు కాదు. మరొకడి భార్య లేచిపోయినందుకూ కాదు. (అలాంటి సందర్భాల్లోనే బాసుడి హృదయం ఆనంద నాట్యం చేస్తుంది!)

కాని, ఈ సందర్భం వేరు. ఆ పూట్పొ ఒక కొత్త కంట్రాక్టరు వెలిశాడు. ఆఫీసు భవన విస్తరణ కార్యక్రమంలో భాగంగా రెండు గదులు కట్టడానికి అతనికి కాంట్రాక్ట్ ఇప్పించాడు బాసుడు. అందుకు కృతజ్ఞతగా బాసుడు గదిలో అడుగు పెట్టగానే 'అబల గడియారం' బహుమానంగా ఇచ్చా డతడు. ఆనందం కాదూ మరి?

ఇంటికి వస్తూనే గడియారాన్ని ముద్దుల భార్య చేతిలో పెట్టాడు బాసుడు. మరునాడు శుక్రవారం. పూజచేసి, వాచీ ధరించవచ్చుని బీరువాలో ఉంచేసిం దామె.

తల్లి తండ్రుల ముఖాలలోని ఆనందాన్ని పసిగట్టి, తమ కోరిక తప్పక నెరవేరుతుందన్న భరోసాతో "సినిమాకు వెళదాం" అన్నారు కుమార బాసులు. వరం అనుగ్రహించేశాడు బాసుడు.



"ఒరేయ్, మొద్దూ! ఇల్లు జాగ్రత్తగా చూసుకో!" అంటూ వాళ్ళు సినిమాకు పోయారు. గణపతికి ఇల్లు అప్పగించి సినిమాలకూ, షికార్లకూ వెళ్ళడం వాళ్ళకు అలవాటే.

కాని, అలవాటుకు విరుద్ధంగా ఒక పని జరిగింది, ఆ రాత్రి.

మరునాడు ఉదయమే చూస్తే వాచీ కనిపించ లేదు బాసుణికి.

"ఏమిరా? వాచీ ఏమైంది?"

"రాత్రి... మరేమోనండీ...మీరు సినిమా కెళ్ళాక...మరేమోనండీ...ఒక గడ్డంవాడు వచ్చి పట్టుకు పోయాడండీ!"

"మరి నువ్వేం చేస్తున్నావురా?"

"చూస్తూనే ఉన్నానండీ...అస్సలు నిద్ర పోలేదండీ."

బాసుదేవుడికి మతి పోయినట్టయింది. కోపమూ వచ్చింది.

"ఇంకా ఏమైనా పట్టుకుపోయాడా?"

నోట్ల కట్ట ఒకటి పట్టుకు పోయాడండీ!"

షాక్ తిన్నట్లు అయింది బాసుకు, బాసుణి— ఇద్దరికీ. కుమారబాసులకు ఇదేం పట్టలేదు. టిఫిన్‌కోసం అల్లరి చేస్తున్నారు. బాసుణి గబగబా వెదికింది బీరువా. రెండు వేలు కట్ట! "చచ్చినోడా! ఇంట్లో దొంగ పడితే పట్టుకోలేక పోయావా? కనీసం అరవలేకపోయావా?" అరిచిం దామె.

"అన్యాయం, అమ్మగారూ! ఇల్లు చూస్తూ ఉండమన్నారు కానీ దొంగలు పడితే పట్టుకోమన లేదుగా మీరు?" అమాయకంగా ముఖం పెట్టి అడిగాడు.

వాడి పోజు చూసి పిల్లల కయితే నవ్వు వచ్చింది కాని, బాసుడికి పట్టరాని ఆగ్రహం కలిగింది. ఫెడీమని వాడి వీపుమీద రెండు దెబ్బలు వేశాడు. చెయ్యి నొప్పి పెట్టింది కాని, వాడికి ఒంటిమీద ఈగ పడినట్టు అయినా లేదు.

"నిన్ను...నిన్ను...కత్తిరించేస్తా. లోక కత్తిరించేస్తాను." అరిచాడు బాసుడు. వీడే దొంగతనం చేసి ఉంటాడని అతని అనుమానం.

"తమరు కత్తిరించలేరండీ. నాకు లోక లేదు కదండీ!" వినయంగా అన్నాడు గణపతి.

సీరియస్‌నెస్ అర్థం కాని కుమారబాసులు గణపతి 'నటన' చూసి పకపక నవ్వేశారు. పిల్లల్ని కొట్టే స్వతంత్రం బాసుదేవుడికి లేదు. ఆ కోపం, ఈ కోపం కలగలిపి, "ఒరేయ్! ఒరేయ్! నీ ఉద్యోగం కత్తిరించేస్తాను. జాగ్రత్త!" అని గర్జించాడు బాసుడు.

"తమరు కత్తిరించలేరండీ. నా ఉద్యోగం ఖాయం అయిపోయిందికదండీ?" అన్నాడు గణపతి, మరింత వినయంగా.

బాసుదేవుడి ముఖం చూసి ఈసారి బాసుణి నవ్వు ఆపుకోలేకపోయింది. ఆమె మీద చెయ్యి ఎత్తలేక మరింత రెచ్చిపోయాడు బాసుడు, "ఒరేయ్! నిన్ను...నిన్ను...శంకరగిరి మన్యాలు పట్టించేస్తాను. జాగ్రత్త!" అని గుంజాకున్నాడు.

గణపతి చేతులు కట్టుకుని మరింత వినయంగా—"తమరు అదీ చేయలేరండీ. ప్యూనులను ఇంకో వూరికి బదిలీ చేయడానికి వీల్లేదుకదండీ?" అన్నాడు.

వాడి వినయం బాసుదేవుడిలో మంటలు రేపుతూంది. అతి వినయం ఆ మంటల్లో ఆజ్యం పోస్తూంది. వేటు తిన్న పులిలా గుర్రుమన్నాడు బాసుదేవుడు. ఒక్క ఉదుటున గణపతిమీదికి లంఘించాడు. కాని, వాడు పక్కకు తప్పుకోవడంతో దభీమని కింద పడ్డాడు బాసుడు.

బాసుణి నోటికి చెంగు అడ్డు పెట్టుకుంది. కుమారబాసులు ఫకాల్మని నవ్వేసి, అంతలోనే బిగుసుకు పోయారు! నవ్వు బలవంతంగా ఆపుకుని కోపం తెచ్చుకుంది బాసుణి.

"నువ్వేం తంటాలు పడతావో పడు. కాని, వారం రోజుల్లో పోయిన సొమ్ము నువ్వే పట్టుక

రావాలి. లేకపోతే నెల నెలా నీ జీతంలోంచి కోసేస్తాను. సరే. పోయి ప్లేట్లు కడుగు. పిల్లలకు టిఫిన్ పెట్టాలి" అంది గంభీరంగా.

గణపతి భోజనాల గదిలోకి వెళ్ళిన మరు నిమిషంలో భళ్ళున శబ్దం వినిపించింది. పరుగున వెళ్ళి చూసింది బాసిణి. అందమైన నీళ్ళ జగ్—గాజుది—కింద పడి ముక్కలైంది. ఈసారి నిజంగా కోపం వచ్చిందామెకు.

"ఇలా పట్టుకున్నానండీ! అలా జారిపోయింది" అంటూ గాజు గ్లాసు ఇలా పట్టుకుని అలా వదిలేశాడు. గ్లాసు ముక్కలైపోయింది!

తిట్టడం మొదలు పెట్టిందామె. తల వంచు కున్నాడు వాడు.

ఆ ఉదయమే కుమార బాసుల్ని స్కూలుకు తీసుకువెళుతూ దారిలో కొట్టాడట. వాళ్ళు ఏడుస్తూ ఇంటికి వచ్చేశారు. వాళ్ళ వెనక గణపతి వచ్చేశాడు.

"రెండు రోజులు దారి చూపిస్తే చాలు—మూడవ రోజు గాడిదలైనా సరే అదే దారిని పోతాయి, తప్పిపోకుండా. మీ పిల్లలకు ఏడాది నుండి స్కూలుకు దారి చూపిస్తున్నా ఒంటరిగా వెళ్ళలేరు!" అన్నాడు గణపతి.

వాడితో వచ్చిన మార్పుకి విస్తుపోయింది బాసిణి. ఎంత వినయంగా ఉండేవాడు! ఎలా తయారైనాడు! వాళ్ళే తిట్టడంవల్ల ప్రయోజనం లేదు. కొట్టడంవల్ల చేతుల నొప్పి తప్ప లాభం లేదు. వాడు తిరగబడి కొడితే అదీ బాసుడి భయం! 'పిల్లే...పిల్లే...ఆఫీసులో కత్తిరించాలి' అను కున్నాడు.

ఆఫీసులో అడుగు పెట్టగానే ఇద్దరు గుమాస్తాల ముందు గణపతి మీద విరుచుకుపడ్డాడు బాసుడు. "ఏరా! ఒళ్ళు పొగరెక్కి ఏడుస్తున్నావా? ఆఫీసులో నీవంత పని అయినా చేయడం లేదట. కత్తిరించేస్తాను. జాగ్రత్త!"

ఆ అరుపులకు గుమాస్తాలు ఝడుసుకున్నారు. కాని, గణపతి తొణకలేదు; బెణకలేదు. నిశ్చలంగా బాసుదేవుడివైపు చూస్తూ, "నీకు ముందు ఒకసారి చెప్పానురా—నీవు నన్ను కత్తిరించలేవని!" అన్నాడు తాపీగా.

పక్కలో బాంబు పడినట్టు ఉలిక్కిపడ్డాడు బాసుదేవుడు.

అతడే కాదు, గుమాస్తాలు కూడా.

బాసుదేవుడి గదిలో రసవత్తరమైన భాగవతం జరుగుతున్నదని ఉప్పు అందిన మిగిలిన గుమాస్తాలు అప్పటికే చుట్టూ గుమిగూడారు. అందరి ముఖాలలోనూ పట్టరాని ఆశ్చర్యం! చీమ చిటుక్కుమన్నా వినిపించేంత నిశ్శబ్దం. గణపతి గుక్క తిప్పుకోలేని అస్త్రాన్ని ప్రయోగించాడు—బాసుదేవుని 'రా' అని సంబోధించి. మరి బాసుదేవుడే అస్త్రాన్ని ఇప్పుడు ప్రయోగిస్తాడోనని ఉత్కంఠతో చూస్తున్నారు వాళ్ళు.

లక్ష్మణుడు మూర్ఛనుండి తేరుకున్నట్లు బాసుదేవుడు దిగ్భ్రాంతి నుండి తేరుకున్నాడు. "నన్ను 'రా' అంటావురా?! కళ్ళు పొరలు కమ్మాయా? కత్తిరించేస్తాను." నోరు జారాక వాలుక కరచు కున్నాడు బాసుడు.

"నేను నీకింద నౌకర్ని అయితే, నీవు ఇంకొకరి కింద నౌకరువి! పై అధికారి నిన్ను 'రా' అని సంబోధిస్తే, నీవు పడతావా? అట్లాగే నేనూ పడను! నీవు నా కెంత మర్యాద ఇస్తే, సరిగా అంతే నేనూ నీకిస్తా! జీతం డబ్బు తప్ప పై రాబడి లేని నా కళ్ళకు పొరలు కమ్మవు. నాబోలూ, డబ్బూ కరిచే నీకు కమ్మాలి! నేను ఆఫీసులో పని చేయడం లేదన్నావు. ఒకే జీతానికి రెండు చోట్ల ఎవరూ పనిచేయరు. నేను ఆఫీసులో పని చేయాలో, నీ ఇంట్లో పని చేయాలో నీవే ఆలోచించుకుని చెప్పు. రేపు ఉదయం వరకూ టైము ఇస్తున్నా" అంటూ అయటికి వచ్చే శాడు గణపతి.

పోటుమీద పోటుగా పాలిక పోట్లు తిన్న వాడిలా కూలిపోయాడు బాసుదేవుడు.

గుమాస్తాలందరూ బయటికి వచ్చి బాసు దేవుడికి కనిపించనిచోట నిలబడి నవ్వుకున్నారు. బాసుదేవుడికి వినిపించని చోటు కెళ్ళి గణపతిని పొగిడేశారు. 'ఒరేయ్—'అంటే వాడికేం కోపం వస్తుందోనని "గణపతిగారూ" అని శంకరరావు పిలిస్తే, "బాబుగారూ" అని నిత్యభక్త పూదర గొట్టాడు.

క్షణంలో ఎదిగిపోయిన గణపతిని ఆశ్చర్యంగా చూస్తూ ఉండిపోయాడు కన్నయ్య. తనూ ప్యూనే. వాడూ ప్యూనే. తనూ చదువుకోలేదు. వాడూ చదువుకోలేదు. అయినా, ఎంత తేడా!

మరునాడు ఆ వార్త దావానలంలా ఆఫీసులో పాకి పోయింది. అందరూ చెవులు కొరుక్కుంటున్నారు. ఆశ్చర్య పోతున్నారు. సంభ్రమపడిపోతున్నారు.

బాసుదేవుడు— తల్లి తద్దినానికి కూడా సెలవు పెట్టని బాసుదేవుడు—నెల రోజులు సెలవు పెట్టాడట! అదీ వార్త.

అతడు సెలవు పెట్టడమే ఆశ్చర్యం అనుకుంటే, మరింత ఆశ్చర్యకరమైన వార్త. బాసుదేవుడి బదిలీ! కోరి చేయించుకున్నాడట!

ఆ రోజు నిత్యభక్త ఇంట్లో సత్యనారాయణ స్వామివారి వ్రతం చేసుకుని, ఆఫీసుకు వచ్చి అందరికీ ప్రసాదం పంచాడు. కొత్త బాసుడు రాలేదు. అందరికీ ఆట విడుపులా ఉంది. అందరూ గణపతిని ఆకాశానికి ఎత్తేస్తున్నారు.

గణపతి గొంతు సవరించుకుని, చిన్న సైజు బాసుదేవుడి పోజులో ఉపన్యాసం మొదలుపెట్టాడు. "నా (వా) సరులారా! బయటపడరు కాని, మీ అందరిలో ఒక లోపం ఉంది. భయం! అధికారిని ఎదిరిస్తే అతడేం చేస్తాడోనని భయం! మీ పెర్సనల్ ఫైల్‌మీద ఎర్రగీత పడుతుందని భయం! అందువల్ల ప్రమోషన్ పోతుందనీ, బదిలీ అవుతుందనీ భయం! ఆ భయంవల్లనే బాసుదేవుడికి మీరు కొమ్ములిచ్చారు. ఆ కొమ్ముల తోనే అతడు మిమ్మల్ని పొడుస్తుంటే సహించారు. మన పని మనం సక్రమంగా చేసుకుంటే ఎవరికైనా మనం ఎందుకు భయపడాలి? బాసుడు అవమానిస్తే, ఎందుకు సహించాలి? నాకు భయం లేదు. ఉద్యోగం ఖాయం అయేవరకూ సహించాను. సమయం చూసి ఎదురుదాడి చేశాను. ఏం జరిగిందో చూశారుగా! నోట్లో వేలుపెడితే కొరకడం అయినా చేతకానివాడు అందరికీ లోకువే. భయపడి పారిపోయే కుక్కని కుర్రవాడు కూడా రాళ్ళు విసురుతూ తరుముతాడు. అదే కుక్క కాస్త నిబ్బరంగా వెనక్కి తిరిగి అరిస్తే చాలు—రాళ్ళు వదిలేసి పరిగెత్తుతాడు కుర్రవాడు! ఇది జ్ఞాపకం ఉంటే చాలు, ఏ బాసుడూ మనల్ని ఏమీ చేయలేడు."

"బాబాగారికీ...జై!" అన్నాడు నిత్యభక్త. నవ్వులతో ఆఫీసు మారుమోగింది. ★

---

## చవక బేరం

రాజుగారొక చిన్న యువరాను
మారు వేషములోన తిరుగుచు
చిట్టి బొమ్మల కొట్టులో తన
మట్టి విగ్రహ మొకటి చూచెను.
ప్రజల కెంతటి భక్తి తనపై
ప్రబలెనో యని మురిసి పోయెను
దైవ విగ్రహ మధ్య మున తన
స్థానమని ఉప్పొంగి పోయెను.
స్వీయమూర్తికి లోకు లిచ్చెడు
వెల నెరింగెడు కౌతుకమ్మున
అణచిపెట్టుచు వర్తకునితో
నతడు బేరము లాడబోయెను

రాజు:

"విలయ తాండవ ముద్ర పట్టిన
విశ్వనాథుని ఖరీదెంతోయ్?
వెన్న ముద్దల గొంగిలించెడు
చిన్న కృష్ణుని ఖరీ దెంతోయ్?"

వర్తకుడు:

"శివుని బొమ్మను కాణి కిస్తు
మాధవుని దుగాణి కిస్తు
ఎక్కువడుగుట లేదు బాబూ!
ఎంచి చూడుడి నవితనంబును"

రాజు:

"అల్లదే ఆ మూల నున్నది
దివ్య తేజము లొలుకు చున్నది
రాజు పోలిక బొమ్మకున్నది
ఎంతకిస్తు వేమిటో యది?"

వర్తకుడు:

"శంకరయ్యను, సల్లనయ్యను
ఒక్కసారే కొన్న వారికి
ఇట్టి పట్టపు రాజు బొమ్మను
పట్టినే నిచ్చివేసెద.
అరే! ఎందుకు పోవుచుండిరి?
నేను తమదే మొదటి బేరము
రండి బాబూ! మూడు బొమ్మలు
రెండు డబ్బుల కిచ్చివేసెద.

—డాక్టర్ మహీధర్ నళినీ మోహన్